రహదారికి మోక్షం

- పుట్టగుంట-గన్నవరం రోడ్డు అభివృద్ధి
- రూ.9.కోట్ల ఎన్‌డీపీ నిధులు
- 13 కి.మీ.పొడవున రహదారి
- 80 శాతం పనులు పూర్తి



దావాజిగూడెం వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

గన్నవరం: నియోజకవర్గంలోని గన్నవరం-పుట్టగుంట ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎన్‌డీపీ నిధులు రూ.9.80 కోట్లు వ్యయంతో 13 కిలోమీటర్ల పొడవునా రహదారి అభివృద్ధి పనులను చేపట్టారు. ఇప్పటికే రోడ్డు నిర్మాణం 80 శాతం వరకు పూర్తికాగ, మరో 20 శాతం పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. వివరాలీలా వున్నాయి.

గతం లోపాలమయం..

గన్నవరం నుంచి మండల కేంద్రమైన ఉంగుటూరుతో పాటు పలు గ్రామాలకు, గుడివాడ వెళ్లేందుకు ఈ రహదారే ప్రధాన ఆధారం. గత టీడీపీ ప్రభుత్వ హయంలో ఈ రహదారి విస్తరణ పనులు చేసినప్పటికి నాణ్యత లోపం, మూడేళ్లుగా విస్తరంగా కురిసిన వర్షాలకు పలు చోట్ల రోడ్డు దెబ్బతింది. దీంతో ఈ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో ఈ రహదారి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

రెండు లైన్ల రోడ్డుగా..

గతేడాది మార్చిలో ఈ రోడ్డు పటిష్టపరిచే పనులకు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ శంకుస్థాపన చేశారు. అనంతరం కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ పుట్టగుంట నుంచి గన్నవరం వరకు రెండు లైన్ల రహదారి నిర్మాణ పనులను ప్రారంభించింది. వర్షాలు వల్ల రహదారి నిర్మాణంలో కొంత జాప్యమైనప్పటికి ఇటీవల పనుల్లో వేగం పుంజుకుంది. ఇప్పటికే పుట్టగుంట నుంచి దావాజిగూడెంలోని ఏలూరు కాలువ దిగువ వరకు 11 కిలోమీటర్ల పొడవునా బీటీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేశారు.

దావాజిగూడెంలో సీసీ రోడ్డు..

నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని పటిష్టపరచడంతో భాగంగా దావాజిగూడెంలో 400 మీటర్ల పొడవునా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గతంలో ఇరుకుగా ఉండే ఈ రహదారిని కొంత మేర విస్తరించడంతో పాటు ముంపు సమస్య లేకుండా అడుగు మేర మెరకు చేసి పటిష్ఠ పరిచారు. రెడిమిక్స్ కాంక్రీట్‌తో సీసీ రోడ్డు చేపట్టిన నిర్మాణ పనులు ఇటీవల పూర్తిచేశారు.

సమన్వయంతో కృషి..

త్వరితగతిన మిగిలిన రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కాంట్రాక్ట్ సంస్థ, ఆర్‌అండ్‌బీ అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు. ఈ రోడ్డు పూర్తిగా అందుబాటులోకి వస్తే గన్నవరం-పుట్టగుంట మధ్య ప్రయాణం సౌకర్యవంతంగా మారనుంది. రోడ్డు అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యే వంశీమోహన్ చూపిన చొరవ పట్ల పరిసరా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్ష



కానూరులో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు

పెనమలూరు: ఏపీ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్‌బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతగా జరిగింది. ఈ మేరకు రీజినల్ కోఆర్డినేటర్, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ వివరాలు తెలిపారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 18,452 మంది అభ్యర్థులు ఎస్ఐ పరీక్షకు దరఖాస్తు చేశారన్నారు. వీరిలో పురుషులు 14,876 మంది, మహిళలు 3576 మంది చొప్పున ఉన్నారు. ప్రభుత్వం కృష్ణా జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలు, ఎన్టీఆర్ జిల్లాలో 26 పరీక్షా కేంద్రల చొప్పున ఏర్పాటు చేశారని తెలిపారు. పరీక్ష ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యహ్నం 1 గంటల వరకు, మరలా మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంట వరకు పరీక్ష జరిగింది. కృష్ణా జిల్లాలో 5502 మంది అభ్యర్థులకు గాను 4727 మది పరీక్ష రాశారని అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 12,950 మందికి గాను 11,181 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. కానూరు వీఆర్ సిద్ధార్థ కాలేజీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన పరీక్షా పత్రాలు సకాలంలో ఆయా పరీక్షా కేంద్రాలకు పంపామని, పరీక్ష ప్రశాంతగా జరిగిందని తెలిపారు. సీపీ కాంతిరాణాటాటా, జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాలతో అదనపు ఎస్పీ సీతారామాంజనేయులు, డీసీపీ సత్తిబాబు, పోలీసు అధికారులు పర్యవేక్షణలో పరీక్ష సమర్థవంతంగా నిర్వహించామన్నారు.

ప్రభుత్వ పథకాలు ఆసరాగా నిలిచాయి

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథితో లబ్ధిదారులు
- కానూరు మురళీనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం



ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి సమస్య వివరిస్తున్న మహిళ

పెనమలూరు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తమ కుటుంబాలకు ఆసరాగా ఉంటున్నాయని పలువురు లబ్ధిదారులు పేర్కొన్నారు. కానూరు మురళీ నగర్‌లో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను అందజేస్తున్న సందర్భంగా పలువురు లబ్ధిదారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ సమాజంలో ఎక్కువ శాతం ఉన్నపేద, మధ్య తరగతి కుటుంబాలు అభివృద్ధి సాధించితేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇది దృష్టిలో ఉంచుకునే జగనన్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి వారిని ఆదుకుంటున్నారని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అవినీతి లేకుండా పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకున్నారు.

టీడీపీ నేతల అక్కసు..

సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు ప్రభుత్వం అమలు చేస్తుంటే టీడీపీ నేతలు అక్కసుతో బురద జల్లుతోందని ఎమ్మెల్యే పార్థసారథి ఆరోపించారు. చంద్రబాబు 14 సంవత్సరాల పాలనలో ఏనాడూ పేదలకు న్యాయం చేయలేదన్నారు. మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, నేడు సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షాన ఉన్నందుకు టీడీపీ నేతలు విషం కక్కుతున్నారని విమర్శించారు. టీడీపీ నేతలకు పేద ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తాడిగడప మున్సిపాలటీ కమిషనర్ ఎన్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే శ్రావణ్, నేరెళ్ల బుజ్జి, సిద్ధిఖ్, తుమాటి శ్రీరాములు, వేమూరి బాలకృష్ణ, తాళ్ల నరేంద్ర, రావిపూడి రమేష్, దాసరి రవి, నర్రా ఆంజనేయప్రసాద్, జి.గోపాలం, మురళీ, లతీఫ్, రెహమాన్, కటికట క్రిష్టోఫర్ అధికారులు పాల్గొన్నారు.

దళిత వాదాన్ని బలంగా వినిపించాలి



ముళ్ళచినుకులు దళిత కథా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న రమాదేవి, మానస, అరుణ

విజయవాడకల్చరల్: దళిత వాదాన్ని బలంగా వినిపించాలని దళితులు తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి కృషి చేయాలని ఐద్వా నాయకురాలు రమాదేవి తెలిపారు. ఎండ్లూరి మానస, అరుణ గోగులమండ సంకలన పరచిన ముళ్ళ చినుకులు దళిత కథా సంకలనం ఆవిష్కరణ సభను శిఖామణి సెంటర్‌ని శిఖరా పాఠశాలలో సంకలనకర్తలు ఆదివారం నిర్వహించారు. కథా సంకలనాన్ని ఆవిష్కరించిన రమాదేవి మాట్లాడుతూ దళితుల పట్ల పాలక పక్షాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, వాటిని ఎదుర్కోవడానికి పోరాటం సాగుతూనే ఉందన్నారు. పోరాటాలు విస్తృతం చేయడానికి దళిత కవులు, రచయితలు లక్ష్యాలను నిర్దేశించుకోవాలిస్సిన అవసముందని చెప్పారు. కవి అరసవిల్లి కృష్ణ కథా సంకలనాన్ని సమీక్ష చేస్తూ కథలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయన్నారు. ఏ సాహిత్యమైనా ప్రజల నుంచి రావాలని, ప్రజల కోసమే రాయాలని సూచించారు. సంకలనంలోని రచయితలు సమాజంలో దళితులు ఎదుర్కొంటున్న అనేక అంశాలను ప్రస్తావించారన్నారు. కథా సంకలన సంపాదుకులు మానస, అరుణ మాట్లాడుతూ తమ లక్ష్యం నెరవేరిందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి శాంతిశ్రీ సభకు అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ రథసారథి బీఆర్ అంబేద్కర్ అందరి వాడని ఆయన సేవలను నేటి తరం యువతీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యావేత్త బండ్ల మాధవరావు, యువ కవి అనిల్ డ్యానీ, కంచర్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

140 మందికి వైద్యపరీక్షలు



నెప్పల్లి సచివాలయం వద్ద పరీక్షలు చేస్తున్న వైద్యులు

కంకిపాడు: వ్యాధులుపై అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచించారు. నెప్పల్లి గ్రామంలో స్మైల్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఆధ్వర్యంలో అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సాధారణ వ్యాధులు, స్త్రీలు, గుండె, చిన్నపిల్లల ఆరోగ్య సమస్యలపై నిపుణులైన వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. 140 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. శిబిరాన్ని మాజీ సర్పంచ్ కొణతం గిరిధర్, స్థానిక పార్టీ నాయకులు మండవ కిషోర్, గుజ్జుల కోటేశ్వరరావు ప్రారంభించారు. వైద్యులు డాక్టర్ కవిత బత్తుల, డాక్టర్ సతీష్ చైతన్య, డాక్టర్ అర్చన, డాక్టర్‌సుజాత, డాక్టర్ ఫిలిప్స్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని డి.శివశేషకుమారి, అను హాస్పిటల్స్ సిబ్బంది పర్యవేక్షించారు.

ధాన్యం డబ్బు జమ చేయాలి

ఉంగుటూరు: ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని, రైతుల వద్ద ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని కోరుతూ ఈ నెల 20న విజయవాడలో రాష్ట్ర పౌర సరఫరాల కార్యాలయం వద్ద జరిగే రాయబారం కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కోశాధికారి టీవీ లక్ష్మణస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలు, తుపానులకు తట్టుకొని, ఇబ్బందులు పడి వరి పండించిన రైతుల ధాన్యం తొలి నెల రోజులు దాటిన డబ్బులు రాకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నెల 16 నుంచి ధాన్యం కొనుగోలు నిలిపివేస్తామనే ప్రకటన అపరాలు వచ్చిన తరువాత వరి కుప్పలు నూర్చే అలవాటు ఉన్న రైతులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు సంఘం అధ్యక్షుడు అజ్మీర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ మాతృభాషా దినోత్సవం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ, బాలోత్సవ్ కమిటీ అధ్యక్షుడు ఎస్.పి.రామరాజు అతిథులుగా హాజరవుతారన్నారు. ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వెన్నా వల్లభరావు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఉపాధ్యక్షుడు గుమ్మా సాంబశివరావులను సత్కరిస్తామని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దైవచింతన ద్వారా ఆధ్యాత్మిక శక్తి

గుణదల(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ దేవుని పట్ల భయ భక్తులు కలిగి ఉండటం ద్వారా ఆధ్యాత్మిక శక్తితో పాటు దేవుని దీవెనలు పొందవచ్చని గుణదల మేరిమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు అన్నారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఆదివారం సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులను ద్దేశించి ఆయన మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో ప్రజలందరూ దేవునికి విధేయులుగా ఉండాలన్నారు. దేవుని ఆజ్ఞలను పాటిస్తూ పవిత్రంగా జీవించాలని సూచించారు. విశ్వాసులు ఆధ్యాత్మికంగా ఎదగాలంటే అనుదిన ప్రార్థన ముఖ్యమని పేర్కొన్నారు. దేవుని కట్టడిలను అనుసరించిన భక్తుల జీవితాలు ఆశీర్వాదకరంగా ఉంటుందని చెప్పారు. దేవుని సూచనలను అనుసరించాలన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సమష్టి దివ్యబలిపూజ సమర్పించి భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.

కార్మికుల జీవనంపై కేంద్ర ప్రభుత్వం దాడి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత చట్టం - 2020 తీసుకొచ్చి రవాణా రంగ కార్మికుల జీవనంపై దాడి చేసిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్ట్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.మోహన్ చెప్పారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఇఫ్ట్యూ నాయకుడు కె.రవీంద్ర అధ్యక్షతన ఆదివారం ఇఫ్ట్యూ విజయవాడ నగర 5వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్న ఆటో, రవాణా రంగ కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడిని ప్రతిఘటించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఆటో, రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. దేశ ప్రజల సొమ్మును కొల్లగొడుతున్న గౌతం అదానీలాంటి కార్పొరేట్ శక్తులకు అన్ని రంగాలను నిబంధనలను అతిక్రమించి నరేంద్ర మోడీ ప్రభుత్వం అక్రమంగా కట్టబెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఇఫ్ట్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు ఎల్.రమాదేవి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు తదితరులు మాట్లాడారు. అనంతరం 19 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉమాపతి, వంశీ కిరణ్, సురేష్, బసవయ్య, కాశీరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం కమనీయం



రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయంలో రామలింగేశ్వరస్వామి కల్యాణం



యనమలకుదురులో నిర్వహిస్తున్న గ్రామోత్సవంలో భక్తులు

రామవరప్పాడు: స్థానిక పేరంటాలమ్మ ఆలయంలోని శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గంగా పార్వతీ సేమత రామలింగేశ్వర స్వామి విగ్రహాలకు శాంతి కల్యాణం చేశారు. ఈ కల్యాణ మహోత్సవానికి హాజరైన ఉభయ దాతలకు శేష వస్త్రములు సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివార్ల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. మహిళల కోలాటం ఆకట్టుకుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి, చైర్మన్ బోయిన భానుప్రదీప్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. కల్యాణం చేసిన మావులూరి రాజశేఖర్ దంపతులు, ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి 8 గంటలకు బలిహరణ చేశారు. గ్రామంలో స్వామివారికి వసంతోత్సవం నిర్వహించారు. పవిత్ర కృష్ణానదిలో త్రిశూల స్నానం చేయించారు.

ముగిసిన ప్రభోత్సవం..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామంలో శనివారం రాత్రి చేపట్టిన ప్రభోత్సవం ఆదివారం ఉదయం వరకు కొనసాగింది. భక్తులు ప్రభలు కొండ చుట్టూ తిప్పి ఘనంగా ప్రభోత్సవం చేశారు. దాదాపు 50 ప్రభలు తిరిగాయి. ప్రభల ఊరేగింపు సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తప్పిన ప్రమాదం..

డొంక రోడ్డు నుంచి వచ్చిన 18వ నంబర్ ప్రభ ఆలయం ఎదురుగా వచ్చిన సమయంలో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ఆలయ దుకాణాలపై ఒరిగింది. ఈ ఘటనలో భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. సకాలంలో ప్రభను తొలగించటంతో ప్రభోత్సవం యథావిధిగా జరిగిందని సీఐ గోవిందరాజు తెలిపారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గంగా పార్వతి సమేత కొండేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం శాంతి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. కొండేశ్వరస్వామి దేవస్థానంలో నండూరు కుటుంబ సభ్యులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు మారుతి నేతృత్వంలో నండూరి కిరణ్, శ్రీదేవి దంపతుల చేతుల మీదుగా శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు చావలి అరుణ, అనూష ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొడెబోయిన బాబి, లింగంనేని రత్నారావు, లంక రామ్మోహనరావు, యల మంచిలి మాధవరావు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నసమారాధన

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో శ్రీభ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తులకు అన్నసమారాధన జరిపారు. శనివారం రాత్రి జరిగిన ఆది దంపతుల కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు చావాలి మురళీ కృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ జరిపారు. ఆలయ ధర్మకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, పరిసరా గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

500 మందికి అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: శ్రీమహావిష్ణువు లోక కల్యాణసమితి ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్‌లో ఆదివారం అన్నదానం నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రదినం సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద అన్నదాన శిబిరం నిర్వహించారు. సుమారు 500 మంది పేదలు, కార్మికులు, యాచకులకు అన్నదానం చేశారు. సమితి అధ్యక్షుడు మారేపల్లి శ్రీనివాసాచార్యులు, కార్యదర్శి మంజులూరి శ్రీనివాసరావు, సభ్యులు వడ్డి రాజేశ్వరరావు, సాయిబాబా, లక్ష్మి పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



తోపుడు బండ్లు అందజేస్తున్న దేవినేని అవినాష్, కార్పొరేటర్ అమర్‌నాథ్, నాయకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయడంతో పాటు దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. 6వ డివిజన్‌లోని నిరుపేద కుటుంబాలకు చెందిన ఏడుగురికి జీవనోపాధి నిమిత్తం ఐదు తోపుడు బండ్లు, ఒక ఇస్త్రీ బండి, ఒక టిఫిన్ బండిని మొత్తం లక్షా యాభై వేల రూపాయల విలువ చేసే బండ్లను ట్రస్ట్ ద్వారా అవినాష్ వారికి ఆదివారం ఉచితంగా అందజేశారు. అవినాష్ మాట్లాడుతూ జీవనోపాధికి ఇబ్బందిగా ఉందని ఆ కుటుంబాల వారు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులకు తెలియజేయడంతో దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా వారికి బండ్లను అందజేశామని చెప్పారు. వైఎస్ జగన్ ప్రభుత్వం తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయాలను మంజూరు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో కూడా ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని అవినాష్ చెప్పారు. స్థానిక కార్పొరేటర్ వియ్యపు అమర్‌నాథ్ మాట్లాడుతూ డివిజన్‌లోని నిరుపేద కుటుంబాలకు చెందిన వారు జీవనోపాధికి ఇబ్బంది పడుతుండటంతో వెంటనే స్పందించి బండ్లను అందజేసిన దేవినేని అవినాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజ, అబ్బినాయుడు, బొమ్మన శివశ్రీనివాస్, సంపత్ పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ..



ముత్యాలంపాడులో భోజనాలు వడ్డిస్తున్న రాజేంద్రప్రసాద్ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఒక్కరికీ స్వామివారి ఆశీస్సులు తప్పక లభించాలని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ హైవే బోర్డు సభ్యుడు వేజెళ్ల రాజేంద్రప్రసాద్ ఆకాంక్షించారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో ఆదివారం మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా వేజెళ్ల రాజేంద్రప్రసాద్ దంపతులచే అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన స్వామివారి మహాశివరాత్రి ఉత్సవాల్లో తాము భాగస్వామి అయ్యినందుకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం 5 వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నందివాహనంలో స్వామివారి రథోత్సవం జరిగింది. స్వామివారిని ముత్యాలంపాడు వీధుల మీదుగా ఊరేగించారు. కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు, కార్యదర్శి డి.నరసింహారాజు, ఐఎస్ఎన్ రాజు, బడేటి ధర్మారావు, ప్రసాదరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటరుకు ఆధార్ అనుసంధానం

విజయవాడ రూరల్: విజయవాడ రూరల్ మండలం గన్నవరం, మైలవరం నియోజకవర్గాలకు సంబంధించి 129 పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ ఏపిక్ నంబర్‌కు అనుసంధానం కార్యక్రమం జరిగింది. గన్నవరం నియోజకవర్గం పరిధిలో 77 పోలింగ్ కేంద్రాల్లో, మైలవరం నియోజకవర్గం పరిధిలో 52 పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు ఓటర్ ఏపిక్ నంబరుకు ఆధార్, గుర్తింపు పొందిన ధ్రువపత్రాలతో అనుసంధానం చేశారు. డెప్యూటీ తహసీల్దారు విజయ్‌కుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రామ్‌సింగ్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గ్రామోత్సవం

కంకిపాడు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గ్రామోత్సవాలు నిర్వహించారు. ఈడుపుగల్లు, ప్రొద్దుటూరు, మద్దూరు, గొడవర్రు తదితర గ్రామాల్లో శైవక్షేత్రాల్లో పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై స్వామి వారి ఉత్సవమూర్తులను ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగింపు జరిపించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. పసుపు నీరు వారబోసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆజాద్ ముస్లిం కమిటీ కార్యదర్శిగా రఫీ



పెనమలూరు: నియోజకవర్గ ఆజాద్ ముస్లిం కమిటీ కార్యదర్శిగా అబ్దుల్ రఫీని నియమించారు. ఈ మేరకు ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా నియామక పత్రం అందజేశారు. యనమలకుదురులో ఆదివారం పెనమలూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ జహీరుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఏ సమస్య వచ్చినా అందరూ ఐక్యంగా ఉండాలన్నారు. పెనమలూరు నియోజవర్గంలో కమిటీ మరింత బలోపేతం చేయాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ముస్లిం మైనార్టీలు ఐకమత్యంతో ఉండాలని నాగుల్‌మీరా కోరారు. కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ అజ్మతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిత్‌ఆలి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షేక్ సత్తార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

విజయవాడ రూరల్: స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి విజయవాడరూరల్ మండల తహసీల్దారు కార్యాలయంలో నిర్వహిస్తామని తహసీల్దార్ పి.జాహ్నవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో నుంచి నడుస్తున్నబస్ సర్వీస్‌ల విలువైన సూచలు, సలహాలు,సమస్యలను ప్రయాణికులు 87909 96090 నంబర్‌కు ఫోన్‌చేసి చెప్పాలని కోరారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకేతు పూజ

నున్న(విజయవాడరూరల్): చినకంచిలో ఆదివారం రాహుకేతువు పూజ నిర్వహించారు. కాలసర్ప దోషం కలిగిన వారి కోసం ప్రత్యేకంగా రాహుకేతు పూజను నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో జరిగే రాహుకేతు పూజ నున్న గ్రామంలోని చినకంచిలో జరగడం వలన దగ్గర్లోని భక్తులు పాల్గొని మొక్కులను చెల్లించుకున్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, తరచూ నీటిని తీసుకోవాలని ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్ సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో చలిగా ఉండటం వల్ల నీరు తక్కువగా తాగటం వల్ల రీనల్ సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ తమ శరీరానికి సరిపడా నీటిని తీసుకోవాలని సూచించారు. రీనల్ సమస్యలకు ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రముఖ హోమియో వైద్యనిపుణులు డాక్టర్ కోన వీరబ్రహ్మం మాట్లాడుతూ.. ప్రస్తుతం కిడ్నీ సమస్యలు అధికమయ్యాయన్నారు. దీనికి కారణం తగినంత నీటిని తీసుకోకపోవటమేనన్నారు. ముఖ్యంగా మహిళలు శరీరానికి అవసరమైనంత నీటిని తీసుకునేలా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హోమియో చికిత్స ద్వారా ఎటువంటి దుష్పలితాలు లేకుండా కిడ్నీ సమస్యలను తగ్గించే అవకాశం ఉందన్నారు. ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ తట్టి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.